


# నవభూమి

జిల్లా అనుబంధం

17 అక్టోబర్,2024 గురువారం పేజీలు:7

www.epaper.navabhoomi.in


## ఇందిరమ్మ రాజ్యం

# రావాలి

- సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ
- ఈ నెలాఖరు వరకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభం
- కులవృత్తుల ప్రోత్సాహానికి ప్రభుత్వం పటిష్ట చర్యలు




**ఖమ్మం, నవభూమి బ్యూరో, అక్టోబర్ 16 :** రాష్ట్రంలో పేదల సంక్షేమం ఇందిరమ్మ రాజ్యంతోనే సాధ్యమని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం నేలకొండపల్లి మండల కేంద్రంలోని భక్త రామదాసు ధ్యాన మందిరం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి నేలకొండపల్లి మండలం లబ్ధిదారులకు కాటమయ్య రక్షక కవచం భద్రత కిట్లను, కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. నేలకొండపల్లి మండలంలో 34 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి పథకం క్రింద ఒక్కో జంటకు లక్షా 116 రూపాయల చొప్పున మొత్తం 34 లక్షల 3 వేల 944 రూపాయలను, అదే విధంగా 61 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద మొత్తం 17 లక్షల 72 వేల 500 రూపాయల చెక్కులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో పేదలకు మంచి జరగాలంటే ఇందిరమ్మ రాజ్యంతో సాధ్యమని ప్రజల ఆశీర్వాదంతో ప్రజా ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడిచిందని, ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుతో పాటు మాట ఇవ్వకపోయినా ప్రజా సంక్షేమం దృష్ట్యా కొన్ని కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. కులవృత్తులైన గీత కార్మికులకు, మత్స్యకారులు, ఇతర కులాల వృత్తులను ప్రోత్సహించేందుకు, కుల వృత్తులు నమ్ముకున్న వారికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని అన్నారు. నిరుపేదలు వైద్యం కోసం ఇబ్బంది పడవద్దని రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంచిందని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఆడ బిడ్డల తల్లిదండ్రులు ఇబ్బంది పడకుండా వివాహానికి కళ్యాణలక్ష్మి క్రింద ఆర్థిక సహాయం అందిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం పాటించిన ఆర్థిక విధానాల కారణంగా రాష్ట్రం దివాలా తీసిందని, ఇందువల్ల మహిళలకు ఇచ్చిన మాట ఒకటి నెరవేర్చలేదని, త్వరలో ఆ పథకం కూడా ప్రారంభిస్తామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2 లక్షల వరకు రుణాలు ఉన్న రైతులకు 18 వేల కోట్ల రుణ మాఫీ చేశామని, 2 లక్షలకు పైగా ఉన్న రైతులకు 13 వేల కోట్ల రుణ మాఫీ తప్పనిసరిగా పూర్తి చేస్తామని అన్నారు. అక్టోబర్ నెలాఖరు వరకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభం అవుతుందని, అసెంబ్లీ నియోజకవర్గానికి 4 వేల ఇండ్ల చొప్పున మంజూరు చేస్తామని అన్నారు. పాలేరు నియోజకవర్గంలో 8 నుంచి 12వ తరగతి వరకు చదివే చిన్నారులకు పి.ఎస్.ఆర్. ట్రస్ట్ ఆధ్వర్యంలో 620 సైకిళ్లను పంపిణీ చేస్తున్నామని, ఇంతకుముందు కూసుమంచి మండలంలో పంపిణీ చేశామని, నేడు నేలకొండపల్లి మండలంలోని చిన్నారులకు సైకిళ్ళు అందిస్తున్నామని అన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాగా చదువుకోవాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ, కాటమయ్య రక్షక కవచ కిట్లకు సంబంధించి పాలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి 100 కిట్లు వచ్చాయని, దీనికి సంబంధించి ఎంపిక చేసిన గీత కార్మికులకు ఈ కిట్లు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలకు ఉన్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రభుత్వం తరపున తహసిల్దార్, ఎంపిడిఓ, మండల పంచాయతీ అధికారి ఎప్పుడు అందుబాటులో ఉంటారని, సమస్యలను వారి దృష్టికి తీసుకొని వస్తే, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం పి.ఎస్.ఆర్. ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ జి. గణేష్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్ రెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖర శర్మ, సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి, నేలకొండపల్లి మండల తహసీల్దార్, ఎంపీడీఓ, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కరెంట్ లేదు

## కాన్పు కోసం వరంగల్ పోండి

- రామవరం మాత శిశు ఆరోగ్య కేంద్రం నిర్వాకం
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం





**కొత్తగూడెం అక్టోబర్ 16 నవభూమి ప్రతి నిధి:** సాధారణంగా కొత్తగూడెం పాల్వంచలో అత్యవసర కేసుల్ని మెరుగైన చికిత్స కోసం తరలించడం సర్వసాధా రణంగా మారింది. తరలింపు లేని వైద్యం సాధ్యం కాదా అని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధి కారుల పర్యవేక్షణ లేకపోవడం, నిర్లక్ష్యంతో రామవరంలో ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రి ఉన్న ఉపయోగం శూన్యమేనా!?గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టత్మకంగా ప్రారంభిం చిన రామవరం మాతా శిశు ఆసుపత్రి సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఆసుపత్రి లో సమస్యల వల్ల గర్భిణీనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెనగడపకు చెందిన నౌషిన్ అనే గర్భిణీకి (రెండో కాన్పు) 10 తేదీ డెలివరీ డేట్ ఇచ్చారు. తరువాత మళ్ళీ డేట్లు మారుస్తూ, 14వ తేదీ తరువాత బుధవారం రమ్మన్నారు. ఆసుపత్రి కు కాన్పుకోసం వస్తే విద్యుత్ లేదు, జనరేటర్ పని చేయడం లేదని గర్భిణీ ని కాన్పు కోసం వరంగల్ కు వెళ్ళమంటున్నారని వాపోతున్నారు. దీనితో గర్భిణీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో బుధవారం విద్యుత్ లేదు. 15 రోజులుగా జనరేటర్ పని చేయడం లేదని సమాచారం. ఇలా రామవరం ఆసుపత్రి వన్నె రోజు రోజుకు తగ్గిపోతోంది కాగా ఖమ్మంలో ప్రభుత్వ ఆసుపత్రి ఉండగా వరంగల్ వెళ్ళమని రిపేర్ చేయడం అర్థం కాకుండా ఉంది.కాగా నౌషిన్ ను పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు చేశారు. ఆమె పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది తల్లి బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారు. రామవరం మాత శిశు ఆసుపత్రి నుండి వెళ్లిన అర్ధ గంటలో కాన్పు అయింది. సిజెరియన్ చేశారు. నిజంగా వరంగల్ దాకా పోయి ఉంటే పరిస్థితి ఏమిటీ? అనేది ఆలోచిస్తేనే భయంగా ఉంది. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చురుగ్గా పనిచేస్తూ నిధులు కేటాయిస్తున్నప్పటికీ ఆ స్థాయిలో అధికారులు పనిచేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.


## CHANGE OF NAME

*I **JWOLA SUDHAKER YADAV** S/O **AYYANNA** Resident of Miyapur, Dist :Rangareddy, Telangana. Changed my Name as **JWALA SUDHAKAR YADAV** S/O **AYYANNA** for all Purposes.*

## అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలి

**రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**సి.సి. కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి**





**ఖమ్మం నవభూమి బ్యూరో, అక్టోబర్16 :** అభివృద్ధి పనులను నాణ్యతతో, అగ్రిమెంట్ సమయంలోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60వ డివిజన్ రామన్నపేట ఎస్సీ కాలనీలో ఎస్.డి.ఆర్.ఎఫ్. నిధులు రూ. 25 లక్షలతో చేపట్టిన సి.సి. కాలువ నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రోడ్డుకు ఇరువైపులా వేస్తున్న రెండు లైన్ల కాలువ నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని మంత్రి సూచించారు. మనం చేపట్టే పనులు నాణ్యతతో ఉండాలని, భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు ఉండవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, 60వ డివిజన్ కార్పొరేటర్ బద్దె నిరంజన్ కుమార్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రావినూతల చర్చి నిర్మాణానికి మంత్రి పొంగులేటి రూ.20వేల విరాళం

**బోనకల్,నవభూమి,అక్టోబర్16 :** మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకుల విజ్ఞప్తి మేరకు తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రావినూతల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చర్చికి రూ. 20వేలను బుధవారం ఉదయం ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విరాళంగా అందించారు. భవిష్యత్తులోనూ చర్చి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విరాళం అందుకున్న చర్చి నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఉమ్మినేని కృష్ణ, భాగం నాగేశ్వరరావు, చర్చి నిర్వాహకులు ఏసుపోగు ప్రభాకర్, తాళ్లూరి రత్నం, తాళ్లూరి ఏసు, తుడుం ప్రసాద్, తాళ్లూరి సామియేలు, కాంపాటి జాన్, తాళ్లూరి వెంకటి తదితరులు ఉన్నారు.



### ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన

# తిరుమలాయపాలెం మండలం





**తిరుమలాయపాలెం నవభూమి అక్టోబర్ 16 :**స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్ గేమ్స్ లో భాగంగా ఇటీవల కూసుమంచి- ముదిగొండ జోన్ లో నిర్వహించినటువంటి జోనల్ క్రీడోత్సవాలలో తిరుమల పాలెం మండలం ఓవరాల్ ఛాంపియన్గా నిలిచింది.తిరుమలాయపాలెం జట్టు అండర్ 17 సీనియర్ బాలుర కబడ్డీలో విజేతగా నిలిచి మొదటి బహుమతి గెలుచుకున్నది.అదేవిధంగా సీనియర్ బాలుర ఖో ఖో లో ద్వితీయ బహుమతి సీనియర్ జూనియర్ బాలికల విభాగాలలో వాలీబాల్ లో తిరుగులేని విజేతగా తిరుమలాయపాలెం జట్టు నిలిచి అందరి ప్రశంసలు అందుకున్నది.అండర్ 14 జూనియర్ బాలుర విభాగంలో ఖో ఖోలో సైతం విజేతగా నిలిచి ఓవరాల్ ఛాంపియన్గా తిరుమలాయపాలెం జట్టు ఆవిర్భవించింది.అదేవిధంగా జోనల్ నుంచి జిల్లా స్థాయి ఖో ఖో లో సైతం రన్నరప్ గా నిలిచి తిరుమలాయపాలెం మండల జట్టు అందర్నీ ఆకట్టుకున్నది.ఈ సందర్భంగా తిరుమలాయపాలెం మండల కేంద్రంలో నిర్వహించినటువంటి ఒక కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి జోనల్ క్రీడోత్సవాలలో ఓవరాల్ ఛాంపియన్గా నిలిచిన తిరుమలాయపాలెం మండల క్రీడాకారులను, వారికి వివిధ క్రీడాంశాలలో శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు – గంగా ప్రసాద్, సైదులు, పాపారావు, సుజాత, కవిత, రాజేశ్వరి, అలివేలు, చంద్రకళ, గారలను మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు మరియు మండల క్రీడోత్సవాల కన్వీనర్ విజయకుమారి తిరుమలాయపాలెం గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ సీతారామరెడ్డి,జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీత పెసర ప్రభాకర్ రెడ్డిలు అభినందించారు.

### స్కాలర్షిప్స్ ఫీరియంబర్స్మెంట్ యుద్ధ

# ప్రాతిపదికన విడుదల చేయాలి

- ◆ పేద విద్యార్థుల చదువు పట్ల నిర్లక్ష్య ధోరణిని వీడాలి
- ◆ పిడిఎస్ యు ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ క్రాంతి,జి మస్తాన్

**ఖమ్మంనగరం, నవభూమి,అక్టోబర్16 :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత విద్యార్థులకు తీరని అన్యాయం చేసిందని,ఎన్నికల సమయంలో విద్యార్థుల పక్షాన నిలబడతానని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ఆలోచించి విద్యార్థులకు స్కాలర్షిప్స్ మరియు ఫీరియంబర్స్మెంట్ విడుదల చేయాలని పి డి ఎస్ యు ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ క్రాంతి,జి మస్తాన్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గత నాలుగు సంవత్సరాలుగా డిగ్రీ మరియు పీజీ విద్యార్థులకు ఫీరియంబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్స్ విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు, బలహీన అట్టడుగు వర్గాల విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. విద్యారంగానికి 30 శాతం నిధులు విడుదల చేయాలని అనేక పోరాటాలు నిర్వహించినప్పటికిని ఈ రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నిరెత్తినట్టుగా వ్యవహరించి పేదల పట్ల పక్షపాతం వహిస్తుందని విమర్శించారు. గత కెసిఆర్ ప్రభుత్వంలో వేల కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్లో ఉన్నాయని, వాటిని పరిష్కరించకుండా కుటుంబ పాలన చేసి పేదలకు అన్యాయం చేశారని, నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరిట ప్రజలకు పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తూ పెండింగ్లో ఉన్న బకాయిలను విడుదల చేయకుండా వారి చదువులకు ఆటంకం కలిగిస్తూ ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో విద్య అనేది సామాన్యుడి నైతిక హక్కు అని, ఆ హక్కులను కాలరాస్తూ విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వంగా నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తూ ఉన్నదన్నారు. బకాయిలు పెండింగ్ లో ఉన్నాయి అనే పేరిట ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు కళాశాలలకు తాళాలు వేసి సమ్మెను ప్రకటించాయని, ఇది ఏమాత్రం ప్రజాస్వామ్య వాతావరణం కాదని విద్యార్థుల




ఎకడమిక్ ఇయర్ ను దెబ్బతీసే కుట్రే అన్నారు. పేద విద్యార్థులకు చదువును దూరం చేసే కుట్రలో భాగమే అని ఇట్టి చర్యలను తక్షణమే యాజమాన్యాలు వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ సమస్యపై శాశ్వత పరిష్కారాన్ని చూపాలని విద్యార్థులకు న్యాయం జరిగే వరకూ రాజీలేని పోరాటాలు చేస్తామని తక్షణమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ లను మరియు ఫీజు రియంబర్స్మెంట్స్ను తక్షణమే విడుదల చేసి పేద విద్యార్థులకు శాస్త్రీయమైన న్యాయమైన విద్యను అందించవలసిందిగా పిడిఎస్యు ఖమ్మం జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు. పెండింగ్లో ఉన్న సుమారు తొమ్మిది వేల కోట్ల రూపాయలు విడుదల చేయకపోతే పి డి ఎస్ యు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అనేక ఆందోళన కార్యక్రమాలను చేపట్టి విద్యార్థులకు న్యాయం జరగనియెడల ప్రజా ప్రతినిధుల ఇండ్లు ముట్టడిస్తామని వారు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# హామీల అమల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

**గార్ల, నవభూమి, అక్టోబర్ 16 :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫ్యాక్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడం లో అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం గార్ల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. ధర్నా నుద్దేశించి రైతు కూలీ సంఘం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి జి. సక్రు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్న ప్రజలకిచ్చిన హామీ లను అమలు చేయకుండా తాత్సారం చేస్తుందన్నారు. పోడు భూములకు పట్టాలు, పాకాల ఏటిపై హైలేవల్ వంతెన నిర్మాణం, తదితర ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ కు అందించారు. ఈ



కార్యక్రమంలో సంఘం మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్, వీరభద్రం, గణేష్, రుక్మారావు, మాధవ రావు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# టియుసిఐలో ఐఎఫ్టీయు విలీనసభను జయప్రదం చేయండి




**టేకులపల్లి అక్టోబర్ 16 నవభూమి ప్రతినిధి :** ఈనెల 20న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ అనుబంధ సంస్థ ఐఎఫ్టియు, విప్లవ కార్మిక సంఘం ఆలిండియా ట్రేడ్ యూనియన్ 14 రాష్ట్రాల్లో పని చేస్తున్న టియుసిఐలో ఐఎఫ్టియు విలీన సభను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం టేకులపల్లి సింగరేణి హైటెక్ కాలనీలో సింగరేణి కాంట్రాక్ట్, కార్మికుల మస్టర్ అడ్డావద్దా మీటింగ్ నిర్వహించారు. ఈమీటింగ్లో ఐఎఫ్టియు టేకులపల్లి ఏరియా కార్యదర్శి సుందర్, జిల్లా నాయకులు పాయం వెంకన్న మాట్లాడుతూ ఈనెల 20న హైదరాబాదు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగు విలీన సభను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. దేశంలో 14 రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న టియుసిఐ సంఘటిత అసంఘటిత రంగాల్లో పనిచేస్తుందని అన్నారు. ఈ తరుణంలో ఐఎఫ్టియు, టియుసిఐలో విలీనం చేసి దేశంలో ఒక బలమైన విప్లవ కార్మిక సంఘంగా ఏర్పడి తద్వారా కార్మిక వర్గంపై నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా కొట్లాడి సాధించుకున్న కార్మిక చట్టాలకు కుదింపుకు వ్యతిరేకంగా పోరాడాలని, దేశంలో రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలు ఆకాశాన్ని అందుకుంటున్న తరుణంలో అసంఘటితరంగ కార్మికుల జీతాలు పెరగక నిరాశతో ఉన్నారని, కార్మికులకు సంక్షేమ పథకాలు అందించడంలో కేంద్ర ప్రభుత్వం చిన్న చూపుచూస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా టియుసిఐను బలోపేతం చేసి, గత 8 సవంత్సలుగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి ఉన్న సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని, ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. నాలుగులేబర్ కోడ్స్ మాత్రం కేంద్ర ప్రభుత్వం బిజెపి పాలిత రాష్ట్రాలు మాత్రం అమలుకు ముందుకు రావడం సిగ్గుచేటు అన్నారు. కార్మిక సమస్యలపై రాజీలేని ఉద్యమాలు నిర్వహించి, కార్మికులను సంఘటితముచేసి, బలమైన కార్మిక పోరాటాలుచేసి కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచికార్మిక వర్గ హక్కులను కాపాడుకోవాలని కార్మికులను కోరారు. ఈనెల 20న జరుగు సభను జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాగమణి, శారద, జ్యోతి, ఎర్రమ్మ, బాలు, సోమ్లా, రవి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిఎంకు ఎమ్మెల్యే సన్మానం

**సత్తుపల్లి-నవభూమి :** ఉత్తమ డిపో మేనేజర్ అవార్డు గ్రహీత యు రాజ్యలక్ష్మిని బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ దంపతులు ఘనంగా సన్మానించారు. సత్తుపల్లి బస్ డిపో రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు పొందిన సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్,రాష్ట్ర కాంగ్రెస్ నాయుకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ను ఇంటిదగ్గర మర్యాదపూర్వకంగా రాజ్యలక్ష్మి కలిశారు. కార్మికుల సమిష్టి కృషితో రాష్ట్రంలో ఉత్తమ డిపోగా ఎంపిక అయిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి మాట్లాడుతూ సత్తుపల్లి డిపో ప్రతి సంవత్సరం ఉత్తమ అవార్డుకు ఎంపీక కావాలన్నారు. ఇందుకు కార్మికులను సమన్వయ పరచడంలో చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. డిపోలో ఎటువంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేందుకు ముందు ఉంటానన్నారు. నిధులు అవసరమైతే కేటాయింపు చేయిస్తానన్నారు. సంపూర్ణ సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ కోరారు.



### వివాహాల్లో ఆడంబరాలు

# నలిగిపోతున్న మధ్యతరగతి ప్రజలు

- ఖర్చులు తగ్గించుకోండి
- స్తోమతకు మించి పోతే మిగిలేది అప్పులే
- పెళ్లిలో వింత పోకడలకు దూరంగా ఉందాం
- వివాహాలను సులభతరం చేద్దాం!
- ఫోటోగ్రాఫర్ కోసమే పెళ్లి అన్నట్టు వింత భంగిమల్లో ఫోజులు



**సత్తుపల్లి, నవభూమి, అక్టోబర్ 16 :** వివాహ తంతులో జరిగే ఆడంబరాలకు సామాన్య, మధ్యతరగతి అమ్మాయిల తల్లిదండ్రులు ఆర్థికంగా పతనమౌవుతున్నారు. మానసికంగా కృంగిపోతున్నారు. స్తోమతకు మించిన ఖర్చులు చేసే అప్పుల పాలౌవుతున్నారు. బంధువులు, స్నేహితులతో పాటు ముఖ పరిచయం ఉన్న అందరినీ వేల సంఖ్యలో పిలవడం (పిలిచిన వారిలో ఎవరు వచ్చారో కూడా గమనించే తీరిక ఉండదు) వచ్చిన వారికి ఆరు నెలల తరువాత అసలు పెళ్లికి వెళ్ళమని కూడా గుర్తుండదు. వివాహ ప్రాంగణం దగ్గర ఆర్భాటం చూసి పిలవని వారు వచ్చి విందు ఆరగిస్తారు. ప్రొద్దున పెళ్లి అయితే స్నానం కూడా చెయ్యని చెమట కంపుతో అపరిశుభ్రంగా ఉన్న వ్యక్తులు అర్ధ రాత్రి నుంచే వంట పనులు ప్రారంభించి ఆహార పదార్థాలు తయారు చేస్తే దానికి విందు అని పేరు పెట్టి ప్రొద్దున వడ్డించడం... రాత్రి పెళ్లి అయితే సీన్ రివర్స్ ఉదయం నుంచే వంట పనులు ప్రారంభిస్తారు. ఆర్థికంగా బలపడిన కుటుంబాల్లో నిశ్చయ తాంబూలాల పేరుతో పెళ్ళి అంత ఆర్భాటం చేయడం పరిపాటిగా మారింది. ఈ ఒరవడిని సామాన్య, మధ్యతరగతి కుటుంబాల వారు పాటిస్తున్నారు. దీంతో వివాహ ఖర్చు సగటును 40 శాతం పెరుగుతోంది.కాబోయే వధూవరులను పెళ్లి కాకుండానే ఒకే చోట కూర్చోపెట్టి, ఆహ్వానితులకు అక్షింతలు ఇచ్చి ఆశీర్వదించమనడం నేడు సంప్రదాయంగా మారింది.పెళ్లి కాకుండానే ప్రీ వెడ్డింగ్ ఫోటో షూట్ అని సినిమా లెవెల్లో వింత సాంప్రదాయానికి లక్షల్లో ఖర్చు చేయటం సామాజిక స్పృహ లేని భంగిమల్లో కాబోయే పెళ్లి కొడుకు,పెళ్లి కూతురు ఫోటోస్ కి పోజ్ లు ఇవ్వటం నూతన సంప్రదాయం అంటున్నారు. ఇంకా ఆ ఫోటోస్ కొన్ని పెళ్లి తంతులో భాగంగా పెద్ద టీవీ స్క్రీన్ పైన ప్రదర్శించడం గొప్పగా భావిస్తున్నారు. మంగళ స్నానం పేరుతో అమ్మాయిని నడి బజారులో కూర్చోబెట్టి అందరి ముందు తల స్నానం చేయించే దౌర్భాగ్యపు సాంస్కృతికి దిగజారారు. ఈ మధ్య చిన్న పిల్లలను సైతం వధూవరులుగా అలంకరించి నడి బజార్లో మంగళ స్నానాలు చేయించే పనికిమాలిన పనులు చేస్తున్నారు. స్టేజీల పైన కూర్చోబెట్టి ఆర్భాటాలు చేసి వారికి చిన్నప్పటి నుంచే పెద్దరికం కట్టబెట్టడం చూస్తుంటే దీనిని ఒక వింత ఆచారంగా భావించాల్సి వస్తోంది. దేశంలో ఎక్కడలేని ఈ వింత సంస్కృతి ఈ మధ్య మన తెలుగు రాష్ట్రాల్లో పెరిగిపోతున్నది. భవిష్యత్ తరాలు ఆర్థిక సుడిగుండంలో పడకుండా ఉండేందుకు ఇవన్నీ తగ్గించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. పెళ్లి కోసం లక్షల రూపాయలు ఖర్చుతో చేసిన డెకరేషన్ పది గంటల్లో ఇంకొ ఫంక్షన్ ఉంటే పీకి పారేయడం చూస్తుంటే దానికి అంత ఖర్చులు అవసరమా అని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. ఫోటోస్ నేచరల్ గా తీయకుండా ఫోటోగ్రాఫర్ కోసమే పెళ్లి చేసుకున్నట్టు వాడు చెప్పిన వింత భంగిమల్లో పోజ్ ఇచ్చి ఫోటోలకు అర్థం పరమార్థం లేకుండా చేస్తున్నారు. (ఫోటోగ్రాఫర్ బిల్ కూడా లక్షల రూపాయలు ఉంటోంది)పెళ్లి బట్టలకు కూడా లక్షల రూపాయలు ఖర్చు చేసి, జీవితంలో మళ్ళీ ఇంకో ఫంక్షన్ కి వాడకుండా, డబ్బు వృధాచేయడం జరుగుతోంది. భోజనాల పేరుతో సమయంతో నిమిత్తం లేకుండా, అల్పాహారం చాట్ , 20 రకాల స్వీట్స్, 50 రకాల వంటకాలు, 10 రకాల ఫ్రూట్స్ , 5 రకాల డిసెర్ట్స్ (ఇవన్నీ జీవితంలో ఎన్నడూ తిననట్టు, ఆహుతులు, అన్నీ తినే ప్రయత్నం చేయడం ఒక వింత ) లక్షల రూపాయలు భోజనానికి ఖర్చు చేస్తున్నారు. ఈ ఆహార పదార్థాలు సగాని కి పైగా వృథా అవుతున్నాయి.పెళ్లి తంతు తరువాత కిలోమీటర్ క్యూలో నిలబడి స్టేజి ఎక్కి మొక్కుబడిగా అక్షింతలు వధూవరుల నెత్తిన చల్లి, వాటిని బూట్లు తొడుకున్న కాళ్లతో తొక్కి ఫోటోస్ కి పోజ్ ఇవ్వడం (ఆ ఫోటోస్ జీవితంలో ఎవరికి చూసే తీరిక కూడా ఉండదు), అనే ప్రక్రియ కూడా ఆక్షేపనీయమే.పెళ్లి జరిపించే పంతుళ్ళు మాటలను, మంత్రాలను పట్టించుకోకుండా ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు చెప్పిన భంగిమల కోసం జరుగుతున్న తంతు చిత్రాతి విచిత్రంగా ఉంటోంది. డీజే మ్యూజిక్ పేరుతో చెవులు, మెదడు భరించలేని అత్యంత భయంకరమైన శబ్దాలతో అర్థం పర్థం లేని సినిమా పాటల నృత్యాలు సంస్కృతిలో భాగమయ్యాయి.కర్ణ కఠోరంగా పాటలు పాడే ఆర్కెస్ట్రా బృందం మరోవైపు ఉంటుంది. ఇంకా మెహెంది, సంగీత్, బాచిలర్ పార్టీ లని, పనికిమాలిన ఈవెంట్స్ అదనంగా ఉంటున్నాయి.మద్యంతో కూడిన విందైతే, హాజరు 110% (బంధు మిత్ర సపరివారంగా అనే ఆహ్వానాన్ని సీరియస్ గా పాటిస్తారు).ఒక పెగ్గు కెపాసిటీ వాడు మూడు పెగ్గులు, మూడు పెగ్గుల కెపాసిటీ వాడు ఆరు పెగ్గులు లాగేస్తారు. తదనంతరం పెళ్ళికొడుకు ఇంటి వద్ద సత్యనారాయణ స్వామి వ్రతం పూజ పవిత్రత మంట కలుపుతూ రిసెప్షన్ పేరుతో మాంసాహార వంటలతో, మళ్ళీ పెళ్లి నాటి ప్రహసనం పునరావృతం అవుతుంది.ఇంకా హనీమూన్ అనే కార్యక్రమం కోసం ప్యాకేజీ టూర్స్ కూడా లక్షల్లోనే ఉంటాయి. గిఫ్ట్స్ పేరుతో వచ్చే పనికిమాలిన వస్తువులను ఏమి చేసుకోవాలో అర్థం కాదు.పగ తీర్చుకొనేందుకు గిఫ్ట్ పేరుతో ప్లాస్టిక్ డబ్బాలు, పచ్చడి సీసాలు వగైరా ఇవ్వడం మొదలు పెట్టారు. పైన చెప్పినవన్నీ మధ్యతరగతి వారు తాహతు కి మించి ఈ మధ్య విపరీతంగా పాటిస్తు అప్పుల పాలవుతున్నారు.ఈ అనాలోచిత విధానాలు ఒకరిని చూసి మరొకరు అనుసరిస్తూ అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. ఎదుటి వారి ఆడంబరాలను చూసి మేము సైతం అంటూ అప్పులు చేసి గొప్పలకు పోతున్నారు. బంధువర్గాలకు మొక్కుబడిగా ఫోన్ చేసి మేము పిలిచాము అని చాటింపు వేస్తున్నారు.ఇతర ముఖ్యమైన పనుల వల్ల ఫంక్షన్ కి వెళ్ళని వారిపై కక్షలు పెంచుకోవడం ఎక్కడి సంస్కృతో అర్థం కావడం లేదు. అందుకే మన ఆడంబరాలకు ఇతరులను ఇబ్బంది పెట్టడం మానుకుందాం.ముఖ్యమైన ఫంక్షన్లకు మాత్రమే బంధువులందరిని ఆహ్వానిద్దాం చిన్న చిన్న ఫంక్షన్లను కుటుంబంలోనే చేసుకుందాం. ఖర్చులు తగ్గించుకుందాం.. అప్పుల ఊబిలోకి వెళ్లకుండా ఉందాం... ఆధునికత పేరుతో వచ్చిన నూతన పోకడలకు స్వస్తి చెబుదాం. పూర్వపు వివాహ బంధాలనుగౌరవిద్దాం. తక్కువ ఖర్చుతో వివాహాలు జరిపించడం ద్వారా ఆర్థిక భారాలను తగ్గించుకుందాం. వధూవరులు కూడా సాంప్రదాయాలను గౌరవిస్తూ ఆధునిక పోకడలకు స్వస్తి పలుకుతూ నిరాడంబరంగా వివాహం చేసుకునేందుకు ముందుకు రావాలని ఆశిద్దాం. సర్వేజనా సుఖినోభవంతు.

# మత్తు పదార్థాలకు యువకులు దూరంగా ఉండాలి

### సాధన కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించిన సిఐ



**జూలూరుపాడు,అక్టోబర్ 16 (నవభూమి ప్రతినిధి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ అధికారి రోహిత్ రాజ్ ఆదేశానుసారం కొత్తగూడెం డిఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ సూచనల మేరకు బుధవారం మండల కేంద్రం లో గల సాధన జూనియర్ కళాశాల విద్యార్థిని,విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు అనే అంశంపై జూలూరుపాడు పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల నిర్మూలన కు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వలన యువకుల భవిష్యత్ అగమ్యగోచరంగా తయారైందని బానిసలు గా మారి కుటుంబాలను గుల్ల చేసుకుంటున్నారని అన్నారు.నేటి విద్యార్థులే రేపటి దేశ పౌరులని బాగా చదువుకొని దేశానికి సేవ చేయాలని సూచించారు.డ్రగ్స్ కు బానిసలు కావద్దని,చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు.డ్రగ్స్ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని,డ్రగ్స్ అమ్మినా, వినియోగించినా కఠినంగా వ్యవహ రిస్తామని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.ఎవరైనా వ్యక్తుల వద్ద డ్రగ్స్ ఉన్నట్లు తెలిస్తే వెంటనే పోలీసు వారికి తెలియజేయాలని కోరారు.

# పురుగుల మందు తాగి యువకుడు మృతి



**సత్తుపల్లి, నవభూమి, అక్టోబర్ 16 :** పురుగుమందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చెరుకుపల్లి పంచాయితీ తురకల గూడెం గ్రామంలో జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం పొట్ట పవన్ (27) బుధవారం తెల్లవారుజామున పురుగుమందు త్రాగాడు అన్నారు. అపస్మార క స్థితిలో ఉండటానికి గమనించి గమనించి 108 వాహనంలో సత్తుపల్లి కి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడన్నారు. మృతుడు పవన్ కు ఐదేళ్ల క్రితం కిష్టారం గ్రామానికి చెందిన గోపికృష్ణ తో ప్రేమ వివాహం జరిగిందన్నారు. ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. భార్య కొంత కాలంగా పుట్టింటిలోనే ఉంటుందన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతికి సంబంధించిన కారణాలు తెలియాల్సి ఉంది.

# 18న జాబ్ మేళా నిర్వహణ

### జిల్లా ఉపాధి అధికారి మాధవి

**ఖమ్మంనగరం, నవభూమి, అక్టోబర్16:** నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలను కల్పించుటకు అక్టోబర్ 18న మోడల్ కెరియర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ టేకులపల్లి) ఖమ్మం వద్ద జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారిణి మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపిక కాబడిన వారికి 11 వేల 500 నుంచి 16 వేల రూపాయల వరకు వేతనం ఉంటుందని, జాబ్ మేళాలో పాల్గొనే యువతీ, యువకులకు 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉండాలని అన్నారు. జాబ్ మేళాలో రిలయన్స్ ట్రెండ్స్ ఖమ్మం, భారతి హ్యుండై, ఖమ్మం, మధిర, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, పాల్వంచ సంస్థల వారు పాల్గొంటారని తెలిపారు. రిలయన్స్ ట్రెండ్స్ ఖమ్మం వారు 18 నుంచి 30 సంవత్సరాల వయసు గల వారు కస్టమర్ సర్వీస్ అసిస్టెంట్, టీం లీడర్, క్యాషియర్ పోస్టులకు 10 మంది పురుషులు, 5 స్త్రీలను భర్తీ చేసుకుంటారని, వీరికి ఇంటర్ లేదా డిగ్రీ అర్హత ఉండాలని, వీరి వేతనం 11,500 నుంచి 15 వేల వరకు ఉంటుందని తెలిపారు. భారతి హ్యుండై కంపెనీ వారు టెలి కాలర్స్ క్రింద 5 స్త్రీలు, సర్వీస్ అడ్వైజర్స్ క్రింద 5 పురుషులు, ఫీల్డ్ సేల్స్ కన్సల్టెంట్ కింద 21 మంది పురుషులను ఎంపిక చేసుకుంటారని, సర్వీస్ అడ్వైజర్లకు మెకానికల్ డిప్లమా ఉండాలని, మిగిలిన పోస్టులకు ఏదైనా డిగ్రీ సరిపోతుందని, అభ్యర్థులకు 22 నుంచి 30 సంవత్సరాల వయసు ఉండాలని, టెలికాలర్లకు వేతనం 9000 ప్లస్ ఇన్సెంటివ్స్, సర్వీస్ అడ్వైజర్లకు వేతనం 11000 ప్లస్ ఇన్సెంటివ్స్, ఫీల్డ్ సేల్స్ కన్సల్టెంట్లకు వేతనం 16000 ప్లస్ ఇన్సెంటివ్స్ ఉంటాయని అన్నారు. అర్హత, ఆసక్తి గల జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో మోడల్ కెరీర్ సెంటర్, ఖమ్మం నందు అక్టోబర్ 18న ఉదయం 10 గంటలకు హాజరు కావాలని, మిగిలిన వివరాలకు 7036902902, 9392922065 ఫోన్ నెంబర్ల నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎస్ఏఆర్ మిల్లు ఆస్తుల వేలానికి ప్రభుత్వ యంత్రాంగం చర్యలు

**ఖమ్మంనగరం,నవభూమి,అక్టోబర్16:** జిల్లాలోని కొనిజర్ల లో ఉన్న ఎస్.ఏ.ఆర్. మిల్లు ఆస్తుల వేలానికి ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఎస్.ఏ.ఆర్. మిల్లుకు సంబంధించి యజమాని, కొణిజర్ల మండలం గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన ఎం. రామ జ్యోతి భర్త: బాలకృష్ణ ప్రసాద్ ప్రభుత్వానికి 2022-23 రబీ కెఎంఎస్, 2023-24 ఖరీఫ్ సిఎంఆర్ బకాయిలకు సంబంధించి 81 కోట్ల 60 లక్షల 90 వేల 635 రూపాయలు బాకీ పడగా, ఈ సొమ్మును తీర్చాల్సిందిగా గతంలో జారీ చేసిన మొదటి నోటీసు గడువు ముగిసినను, బాకీదారు నుండి ఎటువంటి స్పందన రాకపోవడంతో, ప్రస్తుతం రెండవ నోటీసు జారీ చేశారు. రెండవ నోటీసు గడువులోగా సంబంధిత డిఫాల్టర్ బాకీ సొమ్ము చెల్లించని పక్షంలో రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం డిఫాల్టర్ ఆస్తులను వేలం వేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టింది.

# పేదల సంక్షేమం ఇందిరమ్మ రాజ్యంతోనే సాధ్యం

- రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 34 మందికి కళ్యాణ లక్ష్మి,61 మందికి పి.ఎస్.ఆర్. ట్రస్ట్ ద్వారా 620 సైకిళ్ళు పంపిణీ
- కాటమయ్య రక్షక కవచం భద్రత కిట్లు పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి













**ఖమ్మం, నవభూమి బ్యూరో, అక్టోబర్ 16 :** రాష్ట్రంలో పేదల సంక్షేమం ఇందిరమ్మ రాజ్యంతోనే సాధ్యమని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం నేలకొండపల్లి మండల కేంద్రంలోని భక్త రామదాసు ధ్యాన మందిరం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి నేలకొండపల్లి మండలం లబ్ధిదారులకు కాటమయ్య రక్షక కవచం భద్రత కిట్లను, కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. నేలకొండపల్లి మండలంలో 34 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి పథకం క్రింద ఒక్కో జంటకు లక్షా 116 రూపాయల చొప్పున మొత్తం 34 లక్షల 3 వేల 944 రూపాయలను, అదే విధంగా 61 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద మొత్తం 17 లక్షల 72 వేల 500 రూపాయల చెక్కులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో పేదలకు మంచి జరగాలంటే ఇందిరమ్మ రాజ్యంతో సాధ్యమని ప్రజల ఆశీర్వాదంతో ప్రజా ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడిచిందని, ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుతో పాటు మాట ఇవ్వకపోయినా ప్రజా సంక్షేమం దృష్ట్యా కొన్ని కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. కులవృత్తులైన గీత కార్మికులకు, మత్స్యకారులు, ఇతర కులాల వృత్తులను ప్రోత్సహించేందుకు, కుల వృత్తులు నమ్ముకున్న వారికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని అన్నారు. నిరుపేదలు వైద్యం కోసం ఇబ్బంది పడవద్దని రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంచిందని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఆడ బిడ్డల తల్లిదండ్రులు ఇబ్బంది పడకుండా వివాహానికి కళ్యాణలక్ష్మి క్రింద ఆర్థిక సహాయం అందిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం పాటించిన ఆర్థిక విధానాల కారణంగా రాష్ట్రం దివాలా తీసిందని, ఇందువల్ల మహిళలకు ఇచ్చిన మాట ఒకటి నెరవేర్చలేదని, త్వరలో ఆ పథకం కూడా ప్రారంభిస్తామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2 లక్షల వరకు రుణాలు ఉన్న రైతులకు 18 వేల కోట్ల రుణ మాఫీ చేశామని, 2 లక్షలకు పైగా ఉన్న రైతులకు 13 వేల కోట్ల రుణ మాఫీ తప్పనిసరిగా పూర్తి చేస్తామని అన్నారు.

### టియుసిఐలో ఐఎఫ్టియు

# విలీన సభను జయప్రదం చేయండి

### ఐఎఫ్టియు జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు



**ములకలపల్లి అక్టోబర్ 16 నవభూమి :** ములకలపల్లి మండల కేంద్రంలో ఈనెల 20 న హైదరాబాదులో జరిగే టి యు సి ఐ లో ఐఎఫ్టియు విలీన సభను జయప్రదం చెయ్యాలని ఈ సందర్భంగా టి యు సి ఐ లో ఐఎఫ్టియు విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్టియు జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు మాట్లాడుతూ భారతదేశంలో 14 రాష్ట్రాలలో సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న 3 విప్లవ కార్మిక సంఘాలు ఒకే సంఘంగా ఏర్పడుతున్న క్రమంలో గత 40 సంవత్సరాలుగా ఐ ఎఫ్ టి యు గా పనిచేస్తున్న విప్లవ కార్మిక సంఘం పేరును టి యు సి ఐ గా నామకరణం చేస్తూ అక్టోబర్ 20న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలీన సభ నిర్వహించడం జరుగుతుందని, ఈ సభకు అన్ని వర్గాల కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్-మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు నూపా భాస్కర్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు నూపా సరోజినీ, ఐ ఎఫ్ టి యు యు పాల్వంచ ఏరియా కమిటీ అధ్యక్షులు వేల్పుల రమేష్,ఏరియా కమిటీ నాయకులు కీసరి వెంకటేశ్వర్లు, బత్తుల ఆంజనేయులు, ఒరుగంటి శ్రీను, పివైఎల్ నాయకులు తాటి నాగరాజు పాల్గొన్నారు.

# వైభవంగా వేట వేంకటేశ్వర స్వామి ధ్వజస్తంభం పునః ప్రతిష్ట



**గార్ల, నవభూమి, అక్టోబర్ 16 :** జిల్లా ప్రసిద్ధి గాంచిన గార్ల మండలం మర్రిగూడెం శివారులోని శ్రీ వేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ధ్వజస్తంభం పునః ప్రతిష్ట కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. తొలుత ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగ శాలలో యాగం తో పాటు ధ్వజస్తంభానికి పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ధ్వజస్తంభానికి వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య ప్రాణ ప్రతిష్ట జరిపారు. సుమారు ఐదు వందల సంవత్సరాల క్రితం తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి వేట మార్గం ఈ ప్రాంతానికి వచ్చి మర్రిగూడెం సమీపంలో శిలాప్రవేశం చేసినట్లు నానుడి. తిరుమల తిరుపతి లో స్వామి వారి బ్రహ్మోత్సవాల అనంతరం ఇక్కడ వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆలయంలో ఏర్పాటు చేసిన ధ్వజస్తంభం కూలి పోవడం తో దాతల సహకారంతో నూతన ధ్వజస్తంభానికి ప్రాణ ప్రతిష్ట జరిపడంతో పాటు బ్రహ్మోత్సవాలు ప్రారంభమైయ్యాయి. ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యుడు కోరం కనకయ్య దంపతులు పూజ కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ధ్వజస్తంభం పునః ప్రతిష్ట లో గార్ల మండలం పరిధిలోని పలు గ్రామాలకు చెందిన భక్తులతో పాటు డోర్నకల్ శివారులోని అమ్మ పాలెం గ్రామానికి చెందిన మల్లం వంశీయులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళా, శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ

## అధికారులతో కలెక్టర్ జితేష్ వి. పాటిల్.సమీక్ష




**కొత్తగూడెం అక్టోబర్ 16 నవభూమి ప్రతినిధి,:** బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ చేపడుతున్న ఐసిడిఎస్ ఆక్టివిటీస్, చైల్డ్ ప్రొటెక్షన్, అడాప్షన్, చైల్డ్ హెల్ప్ లైన్ పై అధికారులతో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ లోప పోషణకు గురైన పిల్లలను సాధారణ స్థితికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని, ప్రతి అంగన్వాడీ కేంద్రం నందు త్రాగునీటి వసతి, విద్యుత్, మరుగుదొడ్లు మొదలైన కనీస వసతులు కల్పించాలని అన్నారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో మునగ, కరివేపాకు, ఉసిరి, చింత, వెలగ మొక్కలు తప్పనిసరిగా నాటాలని ఆదేశించారు. ఈ మొక్కలు నాటి వినియోగించడం ద్వారా విటమిన్ ఏ, సి, డి, క్యాల్షియం పుష్కలంగా వస్తాయని దీని ద్వారా పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని అన్నారు. జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాల వివరాలు, స్థలం వివరాలు అందజేయాలని సిపిడిఓ లను ఆదేశించారు.

అంగన్వాడీ కేంద్రాలు, ఐసిడిఎస్ కార్యాలయం ల నిర్మాణంకు త్వరలోనే స్థలం కేటాయిస్తామన్నారు. జిల్లాలో బాల కార్మికుల నిర్మూలన, బాలల భిక్షాటన, బాల్య వివాహాల నిర్మూలన కోసం డి సి పి యు సమన్వయంగా పనిచేసి జిల్లాను బాలల స్నేహపూరిత జిల్లాగా మార్చాలని అన్నారు. జిల్లాలోని అన్ని అంగన్వాడి కేంద్రాల్లో తమ పరిధిలో ఎంతమంది పిల్లలు, గర్భిణీ స్త్రీలు ఉన్నారో వారి ఖచ్చితమైన వివరాలను నిర్దేశించిన పట్టిక ద్వారా నమోదు చేయాలని ఆదేశించారు. ఖచ్చితమైన వివరాలు నమోదు చేయడం ద్వారా వారి ఆరోగ్య స్థితికి అనుగుణంగా వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉందని కలెక్టర్ అన్నారు..సమీక్ష సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లేనిన, ప్రాజెక్ట్ సీపీడీవోలు, సిడబ్ల్యుసి మెంబర్లు, డి సి పి యు యూనిట్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సిబ్బంది పాల్గొన్నారు.

# ఊరూవాడా యువనేత జన్మదిన వేడుకలు

- సోషల్ మీడియాలో చావా శివరామకృష్ణ ట్రెండ్
- ఘనంగా చావా శివరామకృష్ణ జన్మదిన వేడుకలు





**తిరుమలాయపాలెం, నవభూమి అక్టోబర్ 16 :**ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ :చావా శివరామకృష్ణ పుట్టిన రోజు వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఊరూవాడా కేకులు కట్ చేసి తమ యువనేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ సామాజిక మాధ్యమాలలో పోస్టులతో హోరెత్తిస్తున్నారు. దీంతో 'హ్యాపీబర్త్? డే ప్యూర్ లీడర్ "హ్యాష్ ట్యాగ్ ట్రెండింగ్ అవుతోంది. పుట్టినరోజు వేడుకలనుహాజరు అయిన చావా శివరామకృష్ణ తిరుమలాయపాలెం బస్టాండ్ సెంటర్ లో కేక్ కట్ చేసి అభిమానులతో జన్మదిన వేడుకలను జరుపుకున్నారు అనంతరం ఎర్రగడ్డ గ్రామంలో నిర్వహించిన పుట్టినరోజు వేడుకల్లో చావా శివరామకృష్ణ పాల్గొని ఆయన అభిమానుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు చావా శివరామకృష్ణ చిత్రపటంతో ర్యాలీ చేశారు. జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆలయంలో పార్టీ నేతలు శివరామకృష్ణ పేరుతో పేరుతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువత ఆధ్వర్యంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ వేడుకల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొని, కేక్ కట్ చేసి పంచిపెట్టారు చావ శివరామకృష్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని మత పెద్దలు సర్వమత ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బోడ మంగీలాల్ మద్దులపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వనవాసం నరేందర్ రెడ్డి నాయక్ ,మాజీ ఎంపీటీసీ గుగ్గిల అంబేద్కర్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మిరియాల విక్రం రెడ్డి, పోట్ల కిరణ్. మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ సైఫుద్దీన్ సిరి గద్దె ఉపేందర్ బత్తుల రవికుమార్ మేకల సైదులు ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు లంజపల్లి చావా శివరామకృష్ణ యువసేన సభ్యులు దూది మెట్ల వెంకట్ యాదవ్, రావూరి యాకూబ్ రావు దొడ్డ గురవయ్య గుగులోత్ సురేష్ నాయక్ సోమనబోయిన మహేష్ బెల్లం రమేష్, బెల్లం రాము పోలేపొంగు, నరసింహారావు, కుమ్మరి కుంట్ల నాగరాజు. షేక్ డాన్ జడల రమేష్ షేక్ సైదా అభిమానులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం

# హేయమైన చర్య

- బీసీ నాయకుడు టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భాష బోయిన వీరన్నపై
- అధికార పార్టీ నాయకుల అండదండలతో ప్రభుత్వ అధికారులు పనిచేస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారు
- ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ తాత మధుసూదన్ హెచ్చరిక



**తిరుమలాయపాలెం నవభూమి అక్టోబర్ 16 :**తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లి గ్రామంలో బుధవారం టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు భాష బోయిన వీరన్న ఇంట్లో జరిగిన టిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పాల్గొన్నారు ఈ సందర్భంగా తాత మధుసూద న్ మాట్లాడుతూ మా కార్యకర్తలను అక్రమ కేసులు పెట్టి జైల పాలు చేసి మమ్ముల ను అప్రతిష్ట పాలు చేస్తున్న అధికార పార్టీ నాయకులకు మా కార్యకర్తలను మా నాయకులను అణిచివేయాలని చూస్తే ఎవరు భయపడేది లేదని ఎవరు భయపడవద్దని ఉద్యమాలకు పురటి గడ్డ తిరుమలాయపాలెం మండలమని ఇలాంటి తాటాకు చప్పులకు భయపెడితే లేదని పోలీసులు కేసులు కొత్త కాదు జైలు గోడలు కొత్త కాదు మమ్మల్ని అనగా తొక్కాలని చూస్తే అంతకంతకు వాళ్లే దిగజారి పోతారని పార్టీ క్యాడర్ని అప్రతిష్టపాలు చేయాలని అధికారపక్ష వారు చూస్తున్నారని కార్యకర్తలు ఎవరు కూడా మనోధైర్యం చెడకూడదని ఎవరు నిరాశకు లోను కాకూడదని కమ్యూనిస్టు భావాలు కలిగిన వీరన్న మా ఉద్యమ పార్టీలో చేరి అతని ఎదుగుదలను ఓర్వలేని కొంతమంది దుర్మార్గులు అక్రమ కేసులు పెట్టి వేధించడం సరైనది కాదని భాష బోయిన వీరన్న ప్రజా సమస్యల కోసం నిరంతరం కృషి చేస్తు మా కార్యకర్తలను కంటికి రెప్పల కాపాడుకుంటున్నామని మా కార్యకర్తల జోలికి వస్తే చూస్తూ ఊరుకునేది లేదని పార్టీని కార్యకర్తలను అనగా తొక్కాలని ప్రయత్నాన్ని మానుకోవాలని మేము 10 సంవత్సరాలు టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి పలు అభివృద్ధి పథకాలు సంక్షేమ ఫలాలు సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రానికి అందించినామని మీకు ఇప్పుడు ఒక అవకాశం వచ్చిందని దానిని వినియోగించుకుని ప్రజలకు మంచి సేవ చేస్తారని ప్రజలు కట్టారని మీరు ప్రజా దుర్వినియోగం చేస్తున్నారని మా కార్యకర్తలపై క్రమ కేసులు బనాయిస్తూ కార్యకర్తలు నిరాశపర్శ ప్రయత్నం చేస్తున్నారని ఇకనైనా ఇలాంటి తప్పుడు ఆరోపణలు మానుకొని ప్రజాసేవకే అంకితం అవ్వాలని లేదంటే ప్రజలు మీకు ఏ విధమైన తీర్పులిచ్చే ప్రభుత్వానికి మీకు పట్టం కట్టారు అదేవిధంగా మిమ్మల్ని పెట్టే రోజు దగ్గరలో వస్తుందని ఈ సందర్భంగా తాతా మధు మాట్లాడడానికి మీ మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతుందని ఈ 10 నెలల్లో మీరు ఇచ్చిన హామీలు ఎన్ని నెరవేర్చారో మీరే చెప్పాలని ప్రజలు అన్ని గమనిస్తున్నారని మీకు ఏ రకమైన బుద్ధి చెప్పాలో ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు తిరుమల రావు గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు ఉప్పల రమణ టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బాషా బోయిన వీరన్న కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ చావా వేణుగోపాలకృష్ణ సొసైటీ వైస్ చైర్మన్ చామకూరి రాజు మాజీ సర్పంచులు కొండ బాల వెంకటేశ్వర్లు పరికపల్లి చంద్రశేఖర్ బోడ మంచ నాయక్ భాష బోయిన శైలజ తమ్మిర వెంకటరెడ్డి దివ్వెల శ్రీనివాస్ పోట్ల జగదీష్ అన్నపర్తి ఉప్పయ్య లపంగి రాములు పోట్ల రామచంద్రయ్య మట్ట వెంకటయ్య అన్నెపర్తి దర్గయ్య గాదరి బాబు నవీన్ యాకయ్య రమేష్ తదితరులు పాల్గొన్నారు

# ఆడపిల్లలు జర జాగ్రత్త !




**కొత్తగూడెం అక్టోబర్ 16 నవభూమి ప్రతినిధి:** ప్రభుత్వాలు ఎన్ని కఠిన చట్టాలను అమలు చేస్తున్న ఎక్కడో ఒకచోట ఆడపిల్ల మీద అఘాయిత్యాలు జరుగుతున్నాయి అని అందుకే ఆడపిల్లలు జర జాగ్రత్తగా ఉండాలి అని షీ టీం సబ్ ఇన్స్పెక్టర్ కొమురయ్య అన్నారు.ఈ రోజు కొత్తగూడెం మున్సిపల్ 12 వ వార్డు సుభాష్ చంద్రబోస్ నగర్ లోని మోడ్రన్ ఇఖ్రా స్కూల్ లో " షీ టీంమరియు భరోసా టీం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సు లో ఆయన మాట్లాడుతూ, ఆడ పిల్లలు అపరిచితులతో మాట్లాడం చేయరాదని, ముఖ్యం గా ఫోన్ లలో చాటింగ్, పేస్ బుక్ లో ఫోటోలు పెట్టరాదని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100 కు డైల్ చేసి సహాయం పొందాలి అని అన్నారు. ఈ సందర్భంగా భరోసా కౌన్సిలర్ రేణుకా మాట్లాడుతూ ప్రభుత్వం, దురదృష్టవశాత్తు ఆడపిల్లలకు, మహిళలకు ఏదైనా జరిగితే న్యాయ సహాయం, సలహా కోసం భరోసా సెంటర్ నెలకొల్పింది అని, దానిని ఉపయోగించుకొని న్యాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగయ్య, స్కూల్ కరస్పాండెంట్ అబ్దుల్ బాసిత్, ప్రధాన అధ్యాపకురాలు పర్వీన్ సుల్తానా, టీచర్లు నీలా, నసరత్, తదితరులు పాల్గొన్నారు.

# 19న దిశ కమిటీ సమావేశం

## కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కొత్తగూడెం అక్టోబర్ 16 నవభూమి ప్రతినిది ,:** ఈనెల 19వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు ఐ డి ఓ సి కార్యాలయం లో దిశా కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి కో చైర్మన్ పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురామ రెడ్డి , జిల్లాకు చెందిన పార్లమెంటు సభ్యులు, జడ్పీ చైర్మన్, శాసనమండలి, శాసనసభ్యులు, దిశా కమిటీ సభ్యులు మరియు అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొననున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ యొక్క సమావేశంలో అన్ని శాఖల అధికారులు తమ శాఖలలో చేపడుతున్న పనుల పై నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని అధికారులను ఆదేశించారు.

# 5 కిలోల గంజాయి పట్టివేత ముగ్గురి అరెస్ట్

**కొత్తగూడెం అక్టోబర్ 16 నవభూమి ప్రతినిధి:** ఖమ్మం డిప్యూటీ కమిషనర్ జనార్దన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఎ ఈ ఎస్ తిరుపతి ఆదేశాల మేరకు ఖమ్మం ఎన్ఫోర్స్మెంట్ సీఐ శ్రీనివాస్, సిబ్బంది లక్ష్మీదేవిపల్లి మండలం లోతు వాగు వద్ద జరిపిన వాహన తనిఖీలలో ఒడిస్సా లోని మల్కాన్గిరి నుండి హైదరాబాద్ కు తరలిస్తున్న ఐదు కేజీల ఎండు గంజాయి రవాణా చేస్తోన్న ముద్దా కిషోర్, కరణ్ రాంబాబు, కరణ్ ఎర్రయ్య పట్టుబడ్డారు. వీరి వద్ద నుండి మూడు సెల్ ఫోన్లు, టీవీఎస్ అపాచీ బైక్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలలో సీఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ కరీం, బాలు కానిస్టేబుల్స్ సుధీర్, వెంకట్, హనుమంతరావు, హరీష్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.



# 18న ఉమ్మడి ఖమ్మం జిల్లా పాఠశాలల అండర్ 17 బాలబాలికల టేబుల్ టెన్నిస్ ఎంపికలు

**కొత్తగూడెం అక్టోబర్ 16 నవభూమి ప్రతినిధి :** ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్ 17 బాలబాలికల టేబుల్ టెన్నిస్ ఎంపికలు అక్టోబర్ 18 వ తేదీన ఉదయం 10 గంటలకు స్థానిక సర్దార్ పటేల్ స్టేడియం క్రీడా ప్రాంగణం, ఖమ్మంలో నిర్వహించనున్నారని ఉమ్మడి జిల్లాల విద్యాశాఖాధికారులు ఈ సోమశేఖరశర్మ, ఎం. వెంకటేశ్వరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలలో పాల్గొనే క్రీడాకారులు 6వ తరగతి నుండి ఇంటర్ వరకు చదువుతూ 1 జనవరి 2008 తరువాత జన్మించిన వారు అర్హులు. ఇంటర్ విద్యార్థులు ఎస్ ఎస్ సి మేమో, ఫోటోతో కూడిన ఎలిజిబిలిటీ ఫామ్, స్టడి సర్టిఫికెట్ తో హాజరు కావలెను పైన పేర్కొన్న ధ్రువీకరణ పత్రములు తీసుకొనిరాని వారిని ఎట్టి పరిస్థితులలోను ఎంపికలకు అనుమతించబడరని ఉమ్మడి ఖమ్మం జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శులు వాసిరెడ్డి నరేష్ కుమార్, కే. నర్సింహ మూర్తి లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఉన్నటువంటి వ్యాయామ ఉపాధ్యాయులు, వ్యాయామ దర్శకులు అందరు కూడా ఈ నియమ నిబంధనలు పాటిస్తూ క్రీడాకారులు సకాలంలో హాజరు అయ్యేలా చూడాలని కోరారు.మరిన్ని వివరాలకు వి. నరేష్ కుమార్,951274678, నర్సింహా మూర్తి,7989731339, సాంబ మూర్తి,9848408335, ప్రేమ్ కుమార్, 9949446551, పై నెంబర్లను సంప్రదించవచ్చు.

# ఆదివాసీ ఆణిముత్యాలు మెడిసిన్ విద్యార్థులకు సన్మానం




**గుండాల అక్టోబర్ 16 నవభూమి:** గుండాల వాసవి క్లబ్ గ్రీన్ ఫీల్డ్, ఆర్యవైశ్య సంఘం గుండాల ఆధ్వర్యంలో ఎంబిబిఎస్ లో సీట్ సాధించిన ఇద్దరు ఆదివాసీ విద్యార్థిలకు ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఎంబిబిఎస్ లో సీట్ సాధించిన సాయినపల్లి గ్రామానికి చెందిన ఇర్పా నాగేశ్వరరావు సుశీల కుమార్తెలు ఇర్ప అమృతరాణి, ఇరుప బేబీ ప్రసన్న ఎంబిబిఎస్ లో ఫ్రీ సీట్ సాధించడంతో వాసవి క్లబ్ మండల అధ్యక్షుడు మానాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మానాల నారాయణమూర్తి, మానాల ప్రణీత్, నాగరాజు, రాంబాబు, అయితా శ్రీశైలం, అయిత పూజిత్ ఐత నాగమల్లయ్య, తాటికొండ వీరన్న, పాలడుగు భరత్, శ్రీరంగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తాటి లక్ష్మికి నివాళులు అర్పించిన గుమ్మడి నర్సయ్య

**జూలూరుపాడు,అక్టోబర్ 16 (నవభూమి ప్రతినిధి) :** మండల పరిధిలోని గుండ్లరేవు గ్రామంలో సిపిఐ ఎం ఎల్ పార్టీ కార్యకర్త తాటి లక్ష్మి ఇటీవల మరణించారు. ఆమె సంతాప సభ బుధవారం జరిగింది. ఈ కార్య క్రమానికి ఇల్లందు నియోజక వర్గ మాజీ శాసన సభ్యులు కామ్రేడ్ గుమ్మడి నరసయ్య హాజరయ్యారు. ఆయన ప్రసంగిస్తూ తాటి లక్ష్మి 1991 నుండి నేటి వరకు విప్లవ కమ్యూనిస్టు పార్టీ ప్రజా పంథా లో సభ్యురాలుగా ఉంటూ అనేక పోరాటాల్లో పాల్గొన్నదని పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పని చేశారని ఆమె సేవలను కొనియా డారు.భూమి కోసం,భుక్తి కోసం,జరిగిన అనేక పోరాటాలలో లక్ష్మి ముందుండి నాయకత్వం వహించే వారని అన్నారు.క్రమ శిక్షణ కలిగిన నాయకురాలు భౌతికంగా మన మధ్య లేకపోవడం పార్టీకి తీరనిలోటని ఆవేదన వ్యక్తంచేశారు.లక్ష్మీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వారి కుటుంబానికి సంతాప సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి జాటోతు కృష్ణ, ఏదులాపురం గోపాలరావు,బానోత్ ధర్మా,కృష్ణయ్య,రాయల సిద్దు గ్రామ పంచాయితీ మాజీ ఉపసర్పంచ్ తాటి రోహిణి,తది తరులు పాల్గొన్నారు.



# ఘనంగా మడత ఆద్య జన్మదిన వేడుకలు

## ఏక్తా హౌస్‌లో మడత ఆద్య జన్మదిన కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే కోరం



**ఇల్లెందు టౌన్ అక్టోబర్ 16 నవభూమి ప్రతినిది ,:** ఏక్తా హౌస్ టీం ఆధ్వర్యంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మడత రమ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ ఏకైక పుత్రిక గారాల ముద్దుబిడ్డ మడత ఆద్య (హనీ) జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి ఆద్యాకు జన్మదిన శుభాకాంక్షలు ఆశీస్సులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మడత అభిమానులు ఏక్తా హౌస్ ముఖ్య కార్యకర్తలు అబ్దుల్ మునాఫ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మడుగు సాంబమూర్తి, కోరం కనకయ్య అనుచరులు పాల్గొన్నారు.

# గోపగాని శంకర్ రావుని, టీజేఎస్ పార్టీని విమర్శించే స్థాయీ నీది కాదు



**గుండాల అక్టోబర్ 16 నవభూమి :** గుండాల మండల బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తెల్లం భాస్కర్ గోపగాని శంకర్రావు ని విమర్శించే స్థాయి కాదు. గోపగాని పార్టీలలో పదవి ఉన్నా లేకపోయినా అనునిత్యం ఏజెన్సీ ప్రాంత ప్రజల అభివృద్ధికై పరితపించే గొప్ప వ్యక్తి గోపగాని శంకర్ రావు. అటువంటి వ్యక్తిని పిచ్చిపిచ్చిగా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని తెలియజేస్తున్నాము. కాంగ్రెస్ పార్టీ మాకు మిత్రపక్షం. మేము మద్దతు ఇచ్చి గెలిపించుకున్నటువంటి ప్రభుత్వం కచ్చితంగా మేము ప్రభుత్వంలో భాగస్వాములం. ఈ ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం అందరి పై ఉందని తెలియజేస్తాము. దానికి అవాకులు చవాకులు పేలి మీరు కాంగ్రెస్ లేక తెలంగాణ జన సమితి నా అనడం విడ్డూరంగా ఉంది. మీ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లోకి ఎందుకు పోతున్నారో మమ్ములను అనే ముందు మీరు ఆత్మ విమర్శ చేసుకోవాలని తెలియజేస్తున్నాము. మేము ఇప్పటికీ అదే మాట చెబుతున్నాము.

రాష్ట్రంలో రైతుబంధు రాళ్లకు రప్పలకు వందల వేల ఎకరాలు ఉన్న భూస్వాములకు వందల లక్షల్లో కోట్లల్లో రైతుబంధు ఇచ్చి కాలేశ్వరం ప్రాజెక్టు విషయంలో కమిషన్ల కోసం ఖకృతిపడి ప్రాజెక్టు లక్షల కోట్ల రూపాయలు హెచ్చించి ఈరోజు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చినారు. తెలంగాణ ఉద్యమ నేత ఉద్యమాన్ని తన వంటి చేత్తో నడుపునటువంటి వ్యక్తి మా ప్రియతమ నాయకులు మా రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం సార్. తనకు ఎమ్మెల్సీ ఇస్తే దాన్ని కూడా మీరు వక్రీకరించి మాట్లాడటం సిగ్గుచేటు 2009లో కేసీఆర్ తప్ప తాగి ఫామ్ హౌస్ లో పడుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి రాజకీయ పార్టీలను ఏకం చేసి సాగరహారం మిలియన్ మార్చ్ వంటావార్పు అటువంటి ఉద్యమాలకు ప్రాతినిధ్యం వహించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రత్యేక స్థానం కలిగినటువంటి వ్యక్తి ప్రొఫెసర్ కోదండరాం సార్. అటువంటి గొప్ప వ్యక్తికి ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇచ్చి ఒక ఉద్యమ కారుని తనతో పాటు ఉద్యమకారులను కూడా సత్కరిస్తే. మీకు కళ్ళు మండిపోతున్నాయి.

రాష్ట్ర ప్రజలు ఉద్యమకారులు మేధావులు విద్యార్థులు అందరూ గొప్ప శు భసూచికంగా భావిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరుల నుండి ప్రొఫెసర్ కోదండరాం సార్ ఉద్యమంలో త్యాగాలు చేస్తే బిఆర్ఎస్ నాయకులు భోగాలు చేసినటువంటి చరిత్ర మీది. రైతుబంధు కానుండి దళిత బంద్ వరకు అన్నిట్లో అవినీతి. దళిత బంధు రాబందులకు ఇచ్చారు.

# కూనంనేని కృషితో డయాలసిస్ సెంటర్

- పాల్వంచకు డయాలసిస్ సెంటర్
- కిడ్నీ రోగులకు ఉపశమనం





**కొత్తగూడెం అక్టోబర్ 16 నవభూమి ప్రతినిధి.:** కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో 40 లక్షలతో పాల్వంచకు డయాలసిస్ సెంటర్ మంజూరైంది.దీన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. దీంతో కిడ్నీ రోగులకు ఉపశమనం లభించనుంది. కిడ్నీ రోగులపై ఆర్థిక భారం తగ్గనుంది. మొత్తం ఐదు డయాలసిస్ యూనిట్లను అమర్చారు. ఒక్కో డయాలసిస్ యూనిట్ లో రోజుకి నాలుగు గంటలు చొప్పున మూడు షిఫ్ట్ లు రోజుకి ముగ్గురు కిడ్నీ రోగులకు డయాలసిస్ చేస్తారు. దీంతో ఐదు యూనిట్లలో ప్రతిరోజు 15 మంది కిడ్నీ రోగులకు డయాలసిస్ చేస్తారు వారంలో రెండుసార్లు చేస్తారునెలలో నాలుగుసార్లు. డయాలసిస్ ప్రైవేట్ లో చేయించుకుంటే నెలకు 25వేల రూపాయలు ఖర్చవుతుంది. ఇలా జీవితాంతం డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంటుంది. కిడ్నీ రోగులకు స్లాట్స్ దొరకడం కష్టంగా ఉంటుంది. పాల్వంచకు కిడ్నీ డయాలసిస్ కేంద్రం రావడం కిడ్నీ రోగులకు గొప్ప ఉపశమనం లభించనుంది. ఇప్పటివరకు పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో 70 మంది కిడ్నీ రోగులు డయాలసిస్ కోసం స్లాట్ పెట్టుకున్నట్టు సమాచారం. మరో నాలుగు రోజుల్లో డయాలసిస్ ప్రారంభం కానుంది. ఇప్పటివరకు పాల్వంచ నుంచి కిడ్నీ రోగులు భద్రాచలం ఇల్లందు కొత్తగూడెం వెళ్తుండేవారు. డయాలసిస్ యూనిట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత విద్య, వైద్యం అన్నారు.త్వరలో 79 లక్షలతో ఆసుపత్రి ని ఆధునికరిస్తామన్నారు.వైద్యులు సిబ్బంది రోగులతో బాధ్యతయుతంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ కొత్వాలా శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, డి సి హెచ్ ఎస్ రవిబాబు, పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి సూపర్నెంట్ రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై తప్పుడు కేసులు తగదు

### ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర అధ్యక్షుడు అమిత్ గౌతమ్





**చర్ల అక్టోబర్ 16 నవభూమి ప్రతినిధి.:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తెలంగాణ చత్తీస్గడ్, ఒరిస్సా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ లపై తప్పుడు కేసుల నమోదుకు నిరసనగా చత్తీస్గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కేంద్రంలో బుధవారం జర్నలిస్టులు భారీ దర్నా నిర్వహించారు. గత ఆగస్ట్ నెలలో సుక్మా జిల్లా కుంట పోలీసుల ప్రోద్బలంతో సుక్మా జిల్లాకు చెందిన నలుగురు జర్నలిస్టు లపై ఆంధ్రప్రదేశ్ పోలీసులు కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. శభరి నది నుండి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో సుక్మా విలేఖరులు కుంటకు రాగా పోలీసుల కుట్ర పూరితంగా వ్యవహరించి జర్నలిస్టుల కారులో గంజాయి పెట్టించి అరెస్టు చేయించారు. దీంతో అప్పటిలో జర్నలిస్టులు ఉద్యమించారు. విచారణ నిర్వహించిన అదికారులు అప్పటి కుంట సిఐ పై సస్పెన్షన్ వేటు వేసారు. ఇటీవల రిమాండయిన జర్నలిస్టులు జైలు నుండి విడుదల అయ్యారు. ఈ విషయమై అక్కడి జర్నలిస్టు సంఘాలు ఆందోళనకు పిలుపునిచ్చాయి. సుక్మా బస్టాండ్ వద్ద బుధవారం జరిగిన సభలో తెలంగాణా, చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిషా రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఐదు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు సభా స్దలం వద్ద నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కు వినతిపత్రం అందచేసారు. కలెక్టర్ కార్యాలయం వద్ద జర్నలిస్టు లకు మాజీ మంత్రి కొవ్వాసి లక్మా సంఘీభావం తెలిపారు. జర్నలిస్టు లపై అక్రమ కేసుల బనాయింపుపై మండిపడ్డారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. అక్రమ కేసులపై సిబిఐ చే విచారణ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సిజి రాష్ట్ర జర్నలిస్ట్ ల సంఘం అద్యక్షుడు అమిత్ గౌతం, మనీష్, జవ్వాది మురళీకృష్ణ, దొడ్డా ప్రభుదాస్, కిషోర్, హరినాగవర్మ, పందిల్లపల్లి వెంకటేశ్వర్లు, కిరణ్, రుషి, వినోద్ కుమార్(దోని), మచ్చా రాజ, రాం లక్ష్మణ్, సాగర్, సురేష్, రాజేష్, సునీల్, శ్రావణ్ పాల్గొన్నారు.

## గ్రామసభలలోనే అర్హులను గుర్తించాలి - వ్యకాస

**కారేపల్లి, నవభూమి, అక్టోబర్16 :** ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు వేస్తున్న ఇందిరమ్మ కమిటీలతో పారదర్శకత పాతర వేసినట్లేనని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు వజ్జా రామారావు లు విమర్శించారు. బుధవారం కారేపల్లిలో వ్యకాస మండల అధ్యక్షులు యనమగండ్ల రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొండబోయిన నాగేశ్వరరావు, వజ్జా రామారావు లు మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీలతో రాజకీయ జోక్యంపెరిగి నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందన్నారు. కమిటీ పెత్తనంతో అధికారుల పాత్ర నామ మాత్రం అవుతుందని అవినీతికి అస్కారం ఇచ్చినట్లు అవుతుందన్నారు. గత ప్రభుత్వ హాయాంలో దళిత బంధు, బీసీ బంధులో జరిగిన అవినీతితో విసిగిన జనం ప్రభుత్వానే మార్చారనే విషయం గుర్తేరగాలన్నారు. ప్రభుత్వ పథకాలకు అర్హుల ఎంపికను గ్రామసభల ద్వారానే జరపాలని డిమాండ్ చేశారు. ఏజన్సీలో ఇందిరమ్మ కమిటీలు గిరిజన చట్టాలకు వ్యతిరేకమన్నారు. ఇందిరమ్మ కమిటీ ఏర్పాటును ప్రభుత్వం విరమించాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు దక్కకపోతే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అందోళన తప్పదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు మన్నెం బ్రహ్మయ్య, కరపటి సీతారాములు దాసరి మల్లయ్య, తుమ్మోజు రామ్మూర్తి, షేక్ సైదులు, అజ్మీర శోభన్, పాపినేని నాగేశ్వరరావు, భూక్య లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

## టిజిఎస్ ఆర్‌టిసి బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం

- కండక్టర్ దురుసు ప్రవర్తన
- స్టాప్ వద్ద ఆగకపోవడంపై ప్రయాణికుల మండిపాటు





**ఇల్లెందు రూరల్ అక్టోబర్ 16 నవభూమి ప్రతినిధి:** హన్మకొండ నుండి భద్రాచలం వెళ్ళే మార్గంలో వెళ్తున్న టిజిఎస్ ఆర్ టి సి బస్సు నెంబర్ టిఎస్ 03 జడ్ 0374 ప్రయాణికుల నిరసనకు కారణమైంది. ఈ బస్సు వరంగల్-1 డిపోకు చెందినదిగా గుర్తించబడింది. ఇది అక్టోబర్ 16 ఉదయం 8:47 గంటలకు ఇల్లెందు ముకుందాపురం స్టాప్ వద్ద ఆపకుండానే వెళ్ళిపోయింది. ఈ సంఘటన కారణంగా ఆ స్టాప్ వద్ద బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.ప్రయాణికుల ఆగ్రహం:ఈ సంఘటనతో తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ప్రయాణికులు మాట్లాడుతూ ముకుందాపురం స్టాప్ లో చాలామంది బస్సు కోసం వేచి ఉన్నారు. అయితే బస్సు ఆపకుండానే వెళ్లిపోవడంతో అనేక మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడం బాధాకరం అని చెప్పారు.ఎండి సజ్జనార్ కి వినతులు:సమస్యను పరిష్కరించడానికి ప్రయాణికులు టిజిఎస్ ఆర్ టి సి ఎండీ సజ్జనార్ కి అనేక ఫిర్యాదులు చేసారు. అయినప్పటికీ ఈ తరహా సంఘటనలు పునరావృతం అవుతుండటంతో ప్రయాణికులు నిరాశకు లోనవుతున్నారు. ప్రయాణికుల అభిప్రాయం ప్రకారం, ఆఫీసర్లు ఇచ్చే హామీలు కేవలం మాటలకే పరిమితం అవుతున్నాయనీ, అనుభవంలో ఆ మార్పు కనిపించడంలేదని వారు పేర్కొన్నారు.గమ్యం యాప్ పై సందేహాలు:టిజిఎస్ ఆర్ టి సి ప్రారంభించిన గమ్యం యాప్ ద్వారా ప్రయాణికుల ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, ఆ యాప్ కూడా సమర్థవంతంగా పనిచేయడం లేదని చాలా మంది అంటున్నారు. గమ్యం యాప్ ద్వారా ఫిర్యాదులు నమోదు చేసినా, సమస్యలు పరిష్కారం కావడంలేదు. వాస్తవానికి ఈ యాప్ ప్రయోజనం ఏంటనే ప్రశ్నలున్నాయని ఓ ప్రయాణికుడు ఆవేదన వ్యక్తం చేశాడు.సుదీర్ఘ సమస్యలు:టిజిఎస్ ఆర్ టి సి విభాగంలో ఈ తరహా నిర్లక్ష్యపు సంఘటనలు పునరావృతమవుతున్నాయ, డ్రైవర్లు ప్రయాణికుల సౌకర్యాలను పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ముకుందాపురం ప్రాంతంలో జరిగిన ఈ సంఘటనపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్సు డ్రైవర్లు మార్గంలో అన్ని స్టాప్ లలో నిలిపేలా పర్యవేక్షణ మరింత కట్టుదిట్టంగా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.సంస్థ చర్యలు:ఈ సంఘటన గురించి తెలిసిన తర్వాత టిజిఎస్ ఆర్ టి సి అధికారులు స్పందిస్తారా లేదా అనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు చేపడుతున్న కార్యక్రమాలు బస్సు డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల విజయవంతం కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

## కారేపల్లి మండలానికి 25 మంది కొత్త టీచర్లు

**కారేపల్లి, నవ భూమి అక్టోబర్16:** కారేపల్లి మండలానికి 25 మంది కొత్త టీచర్లు వచ్చారు. డీఎస్సీ%-%2024 ద్వారా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు కౌన్సిలింగ్ ద్వారా కేటాయించిన పాఠశాలలకు బుధవారం వచ్చి జాయిన్ అయ్యారు. నల్గురు స్కూల్ అసిస్టెంట్లు యూపీఎస్ పోలంపల్లి గేటుతండా, గుంపెళ్ళగూడెం, గుట్టకిందిగుంపు, కారేపల్లి హైస్కూల్ లో జాయిన్ అయ్యారు. నూతన ఉపాధ్యాయులు పోస్టింగ్ జాయిన్ అర్డర్లను మండల విద్యాశాఖాధికారి జయరాజ్‌కు అందజేశారు. డీఎస్సీ%-%2024 న ద్వారా నూతనంగా మండలానికి వచ్చిన స్కూల్ అసిస్టెంట్లు 4, సెంకడ్‌గ్రేడ్ టీచర్లు 21 కి ఉపాధ్యాయ సంఘాల నేతలు స్వాగతం ఫలికారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయు సంఘాల నేతలు బానోత్ మంగీలాల్, బాలిన వెంకటరెడ్డి, వాంకుడోత్ మంగీలాల్, అజ్మీర వీరునాయర్, ఈర్యానాయక్, పాపాలాల్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.